
తనని బెదిరించి భయపెట్టే సమాజానికి ఆమె ఎలా ఎదురు తిరిగింది?

# సమాజం లేదు

దేవరకొండ గంగాధర రామారావు కథ

ఆ ఊరి పొలిమేర దాటివస్తే దక్షిణంగా ఒక సన్నని కాలిబాట వుంది. అది కొంత దూరం వెళ్లి చెరిగిపోయిన గీతలా, చెదిరిపోయిన జీవితంలా, అరణ్యంలా పెరిగిన చెట్లలో మాయమౌతుంది. అక్కడినుంచి ముళ్ల పొదలూ, పాముల పుట్టలూ దాటుకుంటూ వెడితే శిథిలావశిష్టమైన శివాలయం కనిపిస్తుంది. ఆలయం వెనుక కొంచెం దూరంలో వేగంగా ప్రవహించే ఒక వాగు కనిపిస్తుంది. ఈ జీవన ప్రవాహాన్ని ఇంతటితో ఆపుచేసి ఆ వాగులో కలిసిపోవాలనుకున్న దౌర్భాగ్యుల గమ్యం అదే! శ్యామల సన్నని కాలిబాటవైపు తిరిగింది. మరికొంత సేపటికి పుట్టలూ, గుట్టలూ దాటుకుంటూ శిథిలాలయం సమీపించింది. ఒకనాటి మానవ సంస్కృతీ, సభ్యతలకు చిహ్నంగా నిలిచిన మంటప స్తంభాలమీది శిల్పాలు ఆమె హృదయాన్ని స్పృశించినట్లయింది. ధూప దీప నైవేద్యాలతో, మంగళ వాద్యాలతో శోభిల్లుతూ వరాలు కురిపించిన ఈ దేవుడు ఈనాడు తనలాగే ప్రజలచేత బహిష్కరింపబడ్డాడు అనుకుంది. గర్భగుడిలో శివలింగం బూజుపట్టి సంస్కారహీనంగా వుంది. ఈ రాతి దేవుడు ప్రసాదించలేని వరాలు ఇప్పుడు అధికారం చేజిక్కించుకున్న దేవుళ్లు ఇస్తారు. వాళ్లకే వందిమాగధులు, నీరాజనాలు! ఆమె తారుమారైన విలువలు తలుచుకుంటూ అలా చూస్తూ వుండిపోయింది. మనిషే దేవుణ్ణి సృష్టించుకున్నాడు. తిరిగి ఆ సృష్టికి భయపడి ఆత్మవంచనతో మొక్కుబడులూ, కానుకలూ అర్పించి, వజ్రకిరీటాలు చేయించి దేవుణ్ణి లంచగొండి అధికారి స్థాయికి దించి సంతృప్తి పడుతున్నాడు. కాని ఏ దేవుడూ ఎప్పుడూ, ఎవరినీ రక్షించగలడని కాని రక్షిస్తాడనికాని శ్యామలకు నమ్మకంలేదు. ఒకప్పుడు



ఆ నమ్మకం వుండేది. కాని ఒక భయంకర రాక్షస రాత్రి ఒక దుర్మార్గుడు తనని బలాత్కారిస్తుంటే తను గుండెలు చీల్చుకుని పిలిచిన పిలుపు ఏ దేవుడూ వినలేదు!

''ఎవరు నువ్వు?'' అన్న పిలుపు ఆమె ఆలోచన్లకు అంతరాయం కలిగించింది. నిర్జన ప్రదేశమనుకున్న ఈ మూల మానవ స్వరం వినగానే శ్యామల త్రుళ్లిపడి, ఆ ధ్వనివచ్చినవైపు చూసింది.

మంటపంలో ఓ స్తంభానికి ఆనుకుని ఎవరో యువకుడు కూర్చున్నాడు. అతని కళ్లు లోతుకుపోయి, గడ్డం మాసిపోయి వుంది. ముప్పై ఏళ్ళుంటాయి. బట్టలు మాసిపోయి, జుట్టు రేగిపోయి పిచ్చివాడిలా వున్నాడు. ఆమె మౌనం గమనించి మళ్లీ అన్నాడు ''ఎందుకొచ్చావిక్కడికి?''

ఏమని చెప్పాలో వెంటనే తోచక కలవరపడింది శ్యామల.

అతను విషణ్ణంగా నవ్వి అన్నాడు. 'నాకు తెలుసు' అని. వెనుకనున్న వాగువైపు చూపించాడు.

శ్యామల గతుక్కుమంది. తన రహస్యం అతనికెలా తెలిసిందా అని ఆశ్చర్యపోయింది. ఆమె అతనివైపు నడిచి ఎదురుగా మరో స్తంభానికి ఆనుకుని కూర్చుంటూ అంది 'నీకెలా తెలుసూ?'

'ఇక్కడికింకెవరూ రారు. అందులోనూ ఒంటరిగా!' అన్నాడతను బాధగా.

'అయితే నువ్వెందుకున్నావిక్కడ?' శ్యామల అడిగింది. అతడు పిచ్చివాడు కాదని తెలుస్తూనే వుంది.

'ఈ ప్రపంచంనుండి శలవు తీసుకుందామనే'

శ్యామల మరింత ఆశ్చర్యపోయింది. తనలాంటి దౌర్భాగ్యులింకా వున్నందుకు ఆమెకు బాధ కలిగింది. అతను చూడడానికి చదువుకున్న వాడిలా వున్నాడు. అయినా ఎందుకింత కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఆ మాటే అడిగింది.

అతను నవ్వాడు. 'అవును. బాగా చదువుకున్నాను. ఎం.ఏ. ఇవిగో చూడు నా సర్టిఫికేట్స్' అంటూ పాంటు జేబులో కుక్కిన కాగితాలు ఆమె ముందరకు విసిరాడు.

ఆమె అవి తీసుకుని మడతలు సరిచేసి చూసింది. అతని యూనివర్శిటీ డిగ్రీ, బోలెడన్ని మెరిట్ సర్టిఫికెట్లు! ఎంత పెద్ద చదువు. శ్యామలకు అతనియెడల గౌరవభావం కలిగింది. ఆ కాగితాలు పదిలంగా మడిచి అతనికివ్వబోయింది.

అతను చీదరింపుగా అన్నాడు. ''వద్దు. నాకొద్దు. అవన్నీ అవతల విసిరేయి. ఆ పని ఈ చేతులతో చేయలేకపోయాను. ఆ కాగితాలే ఇంకా నన్నీ ప్రపంచానికి కట్టి పడేశాయి. ఇప్పుడు ఈ శంకర్‌కి ఏ బంధాలూ లేవు''

''ఇంత చదువు చదివి చివరకు...'' శ్యామల మాటలు మధ్యలో ఆపి అతనన్నాడు. ''చివరకు ఏమీ సాధించలేకపోయాను. ఈ డిగ్రీలు నిరర్థకం. నా తెలివి నిరర్థకం. ఈ దేశం నన్ను గుర్తించలేదు. నా చదువంతా బ్యాంక్ జవాను పనికి, గోడౌను గుమాస్తాగిరికి ధారపోయలేను. అంతకన్నా నేను ఎందుకూ పనికిరానంటోంది ఈ ప్రభుత్వం. ఈ ప్రైవేటు కంపెనీలు. చదువుకన్నా పెద్ద డిగ్రీ రికమెండేషన్. అది నాకు లేదు. ఈ దేశం నన్నవమానించింది.

అతని దుస్థితికి శ్యామల హృదయం కరిగిపోయింది. తను ఒక ఆడదానిగా, సమాజంలో అవమానాలూ, అపనిందలూ సహించలేక తనకు జరిగిన అన్యాయాలను ఎదిరించలేక ఇలా వచ్చింది. కాని ఇతను అన్ని అర్హతలూ వుండి, అందరి మన్ననలూ అందుకోవలసిన సమయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అన్యాయం, క్రూరం అనిపించింది. మన దేశం మేధావులను ఇలా తరిమి కొడుతోందా? తన భూమిమీద వెలిసే మాణిక్యాలను గంగపాలుచేస్తోందా? ఆమె హృదయం ఆక్రోశించింది. అంతమాత్రం చేత శంకర్ తీసుకున్న నిర్ణయంకూడా క్షమార్హనీయం కాదనిపించింది. ఆమె అతనిలో కొంత ఉత్సాహం కలిగించాలని అంది ''చూడు, నీకెందుకింత నిస్పృహ? ఉద్యోగం రానంత మాత్రాన ప్రాణాలు తీసుకుంటావా? ఓపిక పడితే ఎప్పటికైనా నీ చదువుకి గుర్తింపు వుంటుంది'' అతను మరింత నిరాశగా

కూరుకుపోతూ అన్నాడు. ''ఊహూ ఈ దేశం ఇప్పట్లో మారదు. నేనొక గొడ్డునైతే బరువు లాగడానికి, చస్తే మాంసానికి పనికొద్దును. కాని ఈ మెదడు! దీని ఉపయోగం దేశానికి లేదు. అందుకే ఎందరో మేధావులు, సైంటిస్టులు, ఆత్మగౌరవంతో నడిచినదారినే నేనూ వెళ్తున్నాను. సరే, నా గొడవ అటుంచి, నువ్వెందుకింత పాపానికి పూనుకున్నావ్?''

శ్యామల విచారంగా అంది ''పాపమా? నా బంధువులు, నా చుట్టు జనం నాలో అలాంటి భావం కలిగించారు''

''ఇంతకీ నువ్వు చేసిన మహాపరాధమేమిటి, అందరూ నీ చావు కోరడానికి'' అతను నీరసంగా అడిగాడు.

శ్యామల తల వంచుకుని బాధగా అంది. ''నా శీలం పోయింది. ఓ దుర్మార్గుడు నన్ను బలాత్కరించాడు''

అంత నీరసంలోనూ ఆ యువకుడు ఆ మాట విని కోపంతో ఆవేశపడుతూ అన్నాడు. ''ఒకరు చేసిన తప్పుకి నీకా శిక్ష!'' శీలం పోయిన మగాడు చావడం విన్నావా? మరి నువ్వెందుకు చావాలనుకుంటున్నావు?''

''పరిస్థితులు నన్నీ నిర్ణయానికి పురికొల్పాయి. అన్యాయం జరిగింది నాకయినా, అవమానం, అనుమానాలు నా నెత్తినే పడ్డాయి. నాకు జరిగిన అన్యాయానికి కోర్టుల వెంటబడి మరింత నవ్వులపాలు కావడం కన్నా గుట్టుగా వుండడమే మేలనుకున్నాం. కాని ఎలాగో నా పరాభవం బట్టబయలైంది. కొన్నాళ్లకి మా నాన్న బెంగతో మరణించాడు. నాకు పెళ్లి జరిగే అదృష్టం అప్పుడే పోయింది. కాని మా అన్నయ్య పెళ్లికి కూడా నేను అడ్డొచ్చాను. నా మీద కిట్టనివాళ్లు అపవాదులువేశారు. సానుభూతి చూపవలసింది, అందరూ నన్ను చులకనగా చూడడం ప్రారంభించారు. కొందరు యువకులు నేనో బజారు మనిషిలా నా వెంట పడ్డారు.

'నీ బతుకు ఇలా బండలైందనుకుంటే, వాడి మొహంకూడా ఎవరూ చూడడంలేదే' అంటూ అమ్మ రోజూ ఏడుపు. అన్నయ్యకూడా చీటికి మాటికి నన్ను విసుక్కోవడం మొదలుపెట్టాడు. అయినవాళ్లకు కూడా భారమనిపించిన బ్రతుకు నాకూ భరించరానిదైంది''

# క్వాలిటీ వుండాలి!



నిర్మాతగా, దర్శకుడిగా రెండు దశాబ్దాలుగా చలనచిత్ర పరిశ్రమతో అవినాభావ సంబంధాలున్న అభిరుచిగల దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ్, మరెవ్వరోకాదు. ఒకనాటి సుప్రసిద్ధ నిర్మాత, రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ అధినేత తమ్మారెడ్డి కృష్ణమూర్తి తనయుడే! తన తండ్రి నిర్మాత అవ్వడంవల్ల తాను నిర్మించే చిత్రాలకుగాని, దర్శకత్వం వహించే చిత్రాలకుగాని ఓ చక్కని ప్లానింగ్ చేసుకుని చేస్తుంటారు. అయితే ఇటీవల విడుదలైన 'వేటగాడు' చిత్రం విషయంలో నిర్మాత, దర్శకుడు తానై వుండికూడా రిలీజ్ విషయంలో నిర్మాణం విషయంలో చాలా ఆలస్యమైంది. ఇదే విషయాన్ని భరద్వాజ్ దగ్గర ప్రస్తావిస్తే ''నాకంటూ ఓ ఇమేజ్ ఏర్పడింది. అందుకని ఎక్కడా కాంప్రమైజ్ కాదల్చుకోలేదు. క్వాలిటీకోసం లేట్ అయింది అంతే.'' అన్నారు.

- సుబ్బారావు

ఆమె కథ విన్న అతను మరింత ఆవేశంతో, ఆవేదనతో కంపించిపోతూ అన్నాడు. ''వీల్లేదు. ఎవడో చేసిన అన్యాయానికి నీ జీవితం బలికాకూడదు. వాడెవడో చెప్పు. నేను వెళ్లి వాడి ప్రాణాలు తీస్తాను''

శ్యామల అతణ్ణి శాంతపరుస్తూ అంది.

''నువ్వు నాపై చూపించే సానుభూతికి నా కృతజ్ఞతలు. కాని నా నాశనానికి కారకుడైన వ్యక్తి ఒక ధనవంతుడు, గూండా. ఇప్పుడు ప్రజానాయకుడు కూడా. సమాజం అతణ్ణి వెలివెయ్యాలి. కాని నన్ను బహిష్కరించి, అతనికి పట్టం కట్టింది. ఇదొక వికృత సంస్కృతి. ప్రజలలోనే చైతన్యం రావాలి. కాని ఇప్పట్లో ఆ సూచనలు లేవు. నువ్వొక్కడివీ చేయగలిగింది ఏమీ లేదు!'' అతను ఇంకా ఆవేశపడుతూనే అన్నాడు. ''కానీ ఏ విప్లవమైనా, ఉద్యమమైనా ఒక్కడితోనే ప్రారంభం అవుతుంది. నా ప్రాణాలు ఇలా నీళ్లపాలు చేసేకంటే ఆ దుర్మార్గుణ్ణి హతమార్చడానికి వినియోగపడితే నా జీవితానికి ఓ అర్థం వుంటుంది. అసలు ఆ పని మీ నాన్న చేయాలి. మీ అన్న చేయాలి. ఈ సంగతి తెలిసిన వందలాది యువకులు చేయాలి. కాని ఏమైపోయారు ఈ యువత? ఏమైంది మన చైతన్యం?'' అంటూ అతను ఆవేశంగా అరిచి, సొమ్మసిల్లి పక్కగా వాలిపోయాడు. శ్యామల కంగారుపడింది. అతని నుదుటిమీద చెమటలు చిందాయి. శ్యామల అతని దగ్గరగా వెళ్లి తన కొంగుతో అతని ముఖంమీద చెమట అద్ది, అతనికి కొంగుతో విసురుతూ అడిగింది.

'ఏమైంది నీకు?' అతను తేరుకుని లేచి అన్నాడు. 'ఏమీ లేదు. రెండురోజులుగా తిండిలేదు. ఇతని డిగ్రీలన్నీ ఇతనికి పట్టెడు మెతుకులు పెట్టలేకపోయాయి. శ్యామల హృదయం బాధగా మూలిగింది. ఆమెలోని మాతృత్వం పొంగింది. ఎలాగైనా అతని ప్రాణాలు కాపాడాలని నిర్ణయించుకుంది.

''నేను ఊళ్లోకి వెళ్లి నీకు తినడానికి ఏమైనా తెస్తాను'' అంది ఆతృతగా.

అతను నీరసంగా నవ్వి అన్నాడు. ''ఈ లోకాన్నే వదిలి వెళ్లిపోదామని వచ్చిన నన్ను కాపాడడానికి ఎందుకింత శ్రమ నీకు? కాని వెళ్లిపో. ఊళ్లోకి వెళ్లి ఇక తిరిగి రాకు!''

''నాకు ఆ ఊళ్లో మిగిలిందేమీ లేదు. నేను తిరిగి వస్తాను. నిన్ను బతికించాలి. ప్రస్తుతం నా ధ్యేయం అదే. నిన్ను బతికించడంకోసమైనా నేను బతుకుతాను. మనిద్దరం ఆవేశంలో తప్పుడు నిర్ణయానికొచ్చామనిపిస్తోంది. అవన్నీ తీరిగ్గా ఆలోచించుకుందాం. చీకటి పడకుండా నేను వెళ్లి వస్తాను. అంతవరకు నువ్వు ఏమీ తొందరపాటు పనిచెయ్యనని మాటివ్వు'' అని చేయి చాచింది. ఆమె ఆదరానికి, అభిమానానికి అతను చలించిపోయాడు. ఆమె చేతిలో చెయ్యివేసి అన్నాడు. ''వెళ్లిరా. నీ నిర్ణయం నువ్వు మార్చుకునేదాకా నేను ఇక్కడనుంచి కదలను''

ఆమె వేగంగా అడుగులు వేసుకుంటూ చెట్లలో కనుమరుగైపోయింది. అతను ఆమె వెళ్లినవైపే చూస్తూ ఆలోచనలలో మునిగిపోయాడు. ఈ అమ్మాయి తనను మేధావిగా గుర్తించింది. తన ప్రాణాలు కాపాడాలని తహతహలాడుతోంది. ఏదో ఆత్మీయతతో తనను కట్టివేసింది. జీవితంలో అందుకోలేని ఏదో తియ్యదనమంతా ఒక్క తేనెచుక్కలా నాలికను తాకినట్టయింది. ఆమె రాకకోసం ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆమె వెళ్లి చాలా సేపయింది. ఇంకా రాలేదు. చీకటి పడబోతోంది. శీతాకాలపు పొద్దు ముందుగానే వాలిపోయింది. చీకటి పడితే ఈ అరణ్యంలో దారి తప్పకుండా రావడం అసంభవం

పైగా ప్రమాదం కూడా. మరికాసేపయింది. ఆమెరాలేదు. అతని ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. ఆమెకు దారిలో ఏ ప్రమాదమూ జరగలేదుకదా! పోనీ తను ఎదురు వెళితే? ఏ దారని వెళ్లగలడు. అసలు రోడ్డు ఎటువైపుందో అతనికే తెలియదు. ఆమె తీరా ఊళ్లోకి వెళ్లాక మనసు మార్చుకుని ఇంటికెళ్లిపోయిందేమో! కొద్ది నిమిషాలు పరిచయమైన వ్యక్తికోసం చీకటి పడుతున్నా వెతుక్కుంటూ వస్తుందా? ఆమె రాకపోయినా రాకపోవచ్చు. అప్పుడు తన నిర్ణయం ఎలాగూ వుంది.. కాని ఆమె వచ్చేవరకు ఇక్కడే వుంటానని మాట ఇచ్చాడు. వుండాలి. వుండి తీరాలి! ఈ రాత్రి. మరో రాత్రి. ఎన్ని రోజులైనా వుండాలి! నిమిషాలు గడుస్తుంటే అతని ఆవేదన ఎక్కువౌతోంది.

ముసురుకుంటున్న చీకట్లలో దూరంగా ఓ స్త్రీ నడిచి వస్తూ కనిపించింది. అతని గుండెలు ఆనందంతో కొట్టుకున్నాయి. అది ఆమే అయి వుండాలి. మరెవరూ ఈ మూలకు వచ్చే సాహసం చేయలేరు. అతని ఊహ రైటయింది. ఆమె బరువుగా కాళ్లీడ్చుకుంటూ వస్తోంది. ఆమె భుజాన్ని ఓ బరువైన సంచీ కూడా వుంది.

అతను ఎదురువెళ్లి ఆమె భుజాన వున్న సంచీ అందుకున్నాడు. ఇద్దరూ మంటపం చేరారు.


''నాకోసం ఎందుకింత త్యాగం చేశావ్?'' అతనడిగాడు ఉద్విగ్నంగా.

''ఏముందీ? ఓ హృదయమున్న మనిషిగా'' అంది మంటపం మీద కూర్చుని పాదాలు నొక్కుకుంటూ. ఆమె అతి సాధారణంగా చెప్పిన మాటల్లో ఎంత మహాత్మ్యం వుందీ! జీవితానికి అర్థమే అది. హృదయమున్న మనిషిగా బతకడమే!

ఆమె సంచిలో చాలా సరుకులు తెచ్చింది. ఇద్దరికి ఫలహారం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, సీసాతో నీళ్లు. అన్ని చూసి అతను ఆశ్చర్యపోయాడు. ''ఇవన్నీ ఎలా కొన్నావ్?''

''నా చేతి వేలికి బంగారపు ఉంగరం వుంది. అది ఇంటి దగ్గర వదలి రావడం మరచిపోయాను. నేను వెళ్లే ముందర చూసుకునే వెళ్లాను''

అతనింకేమీ అడగలేదు. ఇద్దరూ ఫలహారం ముగించారు. అతనికి కొంచెం శక్తి వచ్చింది. బాగా చీకటి పడింది. అతను వెలుగుతున్న కొవ్వొత్తి ఎత్తి పట్టుకుని ఆమె ముఖానికి దగ్గరగా పెట్టి



చూస్తున్నాడు. అతని వింత ప్రవర్తనకి శ్యామల తికమకపడిం అంది ''ఏమిటి అలా చూస్తున్నావ్?''

''ఏమీ లేదు. ఇంతవరకు మనుషులలో రాక్షసులెలా వుంటారో చూశాను. ఇప్పుడు దేవతలెలా వుంటారో అని చూస్తున్నాను'' అన్నాడు నీళ్లు నిండిన కళ్లతో.

ఆమె బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి.

''అయితే నేను దేవతనా?'' అంది సందేహంగా.

''అవును. నువ్వు దేవతవి. ఎవరిలో మానవత్వం వుంటుందో వాళ్లే దేవతలు''

కాని నన్నా సమాజం దేవతగా గుర్తించలేదే?'' అంది శ్యామల.

''గుర్తించలేదు. ఓ రత్నాన్ని పోగొట్టుకుంది''

''నీలాంటి మేధావినే తరిమికొట్టింది. నేనొక లెక్కా!''

''నువ్వా నేనా అన్న ప్రశ్నకాదు. అక్కడ మంచికి, మానవత్వానికి స్థానం లేదు. ఆ సమాజం కుళ్లిపోయింది''

ఇద్దరూ కుళ్లిపోయిన సంస్కృతి కారణంగా తమ జీవితాలనే అంతం చేసుకోవాలన్న నిర్ణయంతో ఇక్కడికొచ్చారు. ఇక్కడ ఒకరి ప్రాణాలు మరొకరు కాపాడాలన్న ప్రయత్నంలో ఒకరికొకరు ఆలంబనగా నిలిచారు. వారిలో కొత్త ఆత్మీయత చోటు చేసుకుంది. జీవితంలో దూరమైన మాధుర్యం కూడా అనుభవానికొచ్చింది. ప్రస్తుతానికి చావాలనుకున్న నిర్ణయం వాయిదా పడింది. జీవితం అంతలోనే ఇద్దరిలోనూ కొత్త ఆశలు రేపింది. ఆమె హృదయంలో ఓ నూతనోల్లాసం పురి విప్పుకుంది.

సమాజం, తనని ఒక పతితగా, కులటగా, భ్రష్టురాలిగా చిత్రించి, హింసలుపెట్టి, చివరకు తనను తనే అసహ్యించుకునే పరిస్థితికి తీసుకొచ్చింది. కాని ఇక్కడ ఒక విద్యాధికుడూ, సహృదయుడూ అయిన ఓ యువకుడు తనను ఏకంగా దేవతగా ప్రతిష్ఠించి తన కన్నీటితో ఆత్మీయతను అభిషేకించాడు. శ్యామలకిప్పుడు న్యూనతాభావం తొలగిపోయింది. ఆమె అస్తిత్వంలో గౌరవం, తనమీద తనకు విశ్వాసం ఏర్పడ్డాయి. అతని భావాలెలా వున్నాయోనని కుతూహలంగా అడిగింది.

''శంకర్, అక్కడ సమాజం కుళ్లిపోయింది అని ఇద్దరం తీర్మానించుకున్నాం. కాని మనం నిన్నటివరకు అందులో భాగమేగా!''

శంకర్ కొంచెం ఆలోచనలో పడ్డాడు. సమాజం ఈ స్థితికి రావడానికి మనమూ బాధ్యులం కాదా అని ఆమె ప్రశ్న? ఆమె తెలివైన ప్రశ్నకి అతను సంతోషించాడు. చివరికి అన్నాడు : ''సమాజంలో ఎప్పుడూ ఒక బలమైన వర్గం, ఒక బలహీనమైన వర్గం వుంటుందనుకుంటాను. ధనం, అధికారం, హోదా ఉన్నవాళ్లు సమాజాన్ని శాసిస్తూ వుంటారు. మిగతా జనం, వాళ్లకు భయపడో, వాళ్ల ప్రాపకం సంపాదించడానికో స్వార్థ ప్రయోజనాలకో వాళ్ల ఇష్టప్రకారం నడుచుకుంటూ, తోటి వారినికూడా నడిపిస్తారు. మంచివాళ్లుకూడా అయిష్టంగానైనా ఆ దారిన నడవక తప్పదు''

''ఇక్కడ నన్ను దేవత అన్నావు. అక్కడ పదిమందిలోకూడా అనగలవా?''

''నాకు ఆత్మవిశ్వాసం వుంది కనుక అంటాను. కానీ నాతో మరి పదిమంది గొంతుకలిపేలా చేయలేను. ఇక్కడ నేను ఆకలికి తాళలేక సొమ్మసిల్లి పడిపోతే నువ్వు తల్లడిల్లిపోయి, సాహసించి నా ప్రాణం కాపాడావ్. ఇదే సిటీలో పేవ్‌మెంట్‌మీద పడి వుంటే ఓ నిట్టూర్పు విడిచి వెళ్లిపోయేదానివి అవునా?''

శ్యామల అంది ''అవును. ఇక్కడ మనకి సమాజం లేదు. దాని కుటిల విలువలు లేవు. మన

చుట్టూ సమాజం కట్టే గోడలు, ముళ్ల కంచెలు లేవు''

''నిజం! ఇక్కడ మనకు కరుణ, మానవత్వం తప్ప మరో చట్టం లేదు. ఇక్కడ నువ్వు, నేను, దేవుడు... ఇంకెవ్వరూ లేరు. ముగ్గురం ఒక్కటే!''

ఆ మాటలకు శ్యామల పొంగిపోయింది. శ్యామలకు భవిష్యత్తంతా ఓ కొత్త కోణంలో రూపుదిద్దుకుంటోంది. ఓ పరిష్కారం లీలగా స్ఫురిస్తూంది. కాని అలసట ముంచుకొస్తూంది. ఆలోచించే శక్తిలేదు. చలి విపరీతంగా వుంది. మంటపంమీద పడుకోవడం కష్టం. శంకర్ ఆమెకు, ఆ గుడికి ఓ మూలగా వున్న గది చూపించి ''నువ్వు ఇక్కడ పడుకో. కొంచెం వెచ్చగా వుంటుంది. నేను ఈ మూలగా పడుకుంటాను అని బయట గోడచాటుగా ముడుచుకు పడుకున్నాడు. శ్యామల ఆ చిన్న గదిలో కొంగు కప్పుకు పడుకుంది. మధ్య మధ్య చలి వణికిస్తోంది. నిద్రపట్టీ, పట్టకుండా వుంది. బయట శంకర్ చలికి వణుకుతున్నాడు. అతని వణుకుతున్న మూలుగు శ్యామల విని అతణ్ణి పిలిచింది. అతను వచ్చాడు.

'రా, నువ్వుకూడా ఇక్కడే సర్దుకు పడుకో. బయట చలికి తట్టుకోలేవ్' అంది. అతను కొంచెం సందేహిస్తూ వచ్చి ఆమె ప్రక్కగా పడుకున్నాడు. ఏమాత్రం కదిలినా ఇద్దరి శరీరాలు తగిలేంత చిన్నగా వుంది ఆ గది. మర్యాదలు పాటించడం కన్న ప్రాణం ముఖ్యం. ఇద్దరూ నిద్రకుపక్రమించారు. అలసిన శరీరాలు మగతగా నిద్రలోకి జారుకున్నాయి

ఓ రాత్రివేళ అతను చలికి వణుకుతు ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు. ఆమె అతని దుస్థితి గమనించి తన కొంగు అతనిమీదకూడా కప్పింది. అతను అందులోనే వీలైనంత శరీరం దాచుకుంటూ కొంగులో ఇమిడిపోయాడు.

ఎప్పుడో అతని చెయ్యి ఆమెను చుట్టుకుంది. అతని ఊపిరి వెచ్చగా తగులుతోంది. మధ్యమధ్య సన్నగా వణుకుతున్నాడు. శ్యామల తన చేతిని అతని చుట్టూ పోనిచ్చి అతని దగ్గరగా జరిగి పాదివి పట్టుకుంది. ఆమె కొంగులో ఇద్దరి ముఖాలూ దగ్గరకు జరిగి, వెచ్చని ఊపిరులు పంచుకుంటున్నాయి.

శేఖర్ మరింత బలంగా ఆమెను దగ్గరకు తీసుకుని ఆమె గుండెలను హత్తుకు పడుకున్నాడు. చీకటిలో ఆశగా ఇరువురి పెదాలు కలిసి

## బాధ

స్నేహితురాళ్లు రాధ, రాణి మాట్లాడుకుంటున్నారు.

''ఏమిటే రాధా! ఏదో బాధలో వున్నట్లున్నావ్!''

''నేను, గోపి ప్రేమించుకున్న విషయం మా ఇంట్లో తెలిసింది. మా పెళ్లి చేస్తామంటున్నారే రాణీ!''

''మంచిదేకదా దానికి బాధెందుకు?''

''ఇక నన్ను సినిమాలకు ఎవరు తిప్పుతారు? ఐస్‌క్రీంలు ఎవరు తినిపిస్తారు?''

- పంతంగి రవీంద్ర శ్రీనివాస్ (సూర్యాపేట)



వేధిస్తున్నారనుకో, ఆమె ఆ ఇంటినుంచి బయటకు వచ్చి కొత్త జీవితం నిర్మించుకుందామని ఆలోచించదు. అలాగే బాధలు అనుభవిస్తూ ఇక భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది. అలాగే ఓ పెళ్లికాని పిల్ల, ఓ విధవరాలు, నాలాటి బలాత్కారానికి గురైన కన్య, నువ్వు, నీలాంటి యువకులు... అందరో ఏదో మూసలోనే జీవించాలని ప్రయత్నిస్తారు''

''నేనా? నాకు మూస ఏముంది? నా అర్హత గుర్తించని ఈ సంఘాన్ని చీదరించుకుని ఇలా వెళ్లిపోదామనుకుంటున్నాను''


''అదొక మాటల గారడి. నువ్వు పలాయనం చిత్తగించావు. నీకో డిగ్రీ వుంది. ఆ డిగ్రీతో సంపాదించవలసిన ఉద్యోగాలూ, అంతస్తులూ వున్నాయి. డిగ్రీ వుందికదా అని ఇక ఆఫీసర్‌లాగే బతకాలా? ఆ డిగ్రీకి నీ జీవితాన్ని బలిచేస్తావా? నువ్వు పెద్ద ఆఫీసరు హోదాలోనే బతకాలనీ, అలాంటి గుర్తింపు నీకు రాకపోతే చావాలని నిర్ణయించుకున్నావు. ఇది మూసలో ఇరుక్కుపోవడంకాదూ ఓ కర్షకుడిగా, కార్మికుడిగా, సేవకుడిగా మరో కొత్త జీవితం అల్లుకోకూడదూ? జీవితంలో కొన్ని విలువలు ప్రధానం. ప్రేమ, ఆప్యాయత, త్యాగం లాంటివి వుంటే జీవితంలో మాధుర్యం చవిచూడవచ్చు. ఇంకా నీ ఆలోచనలు మారందే నిన్నొక పిరికివాడిగానే భావిస్తాను'' ఆమె ఆవేశంగా ఉపన్యాస ధోరణిలో చెప్పింది. ఆమె మాటలకు శంకర్ ముగ్ధుడైపోయాడు. చప్పట్లు కొడుతూ వచ్చి ఆమెను బలంగా కౌగిలిలోకి తీసుకుని 'నీలాంటి తెలివైన అమ్మాయి, ఇంత ధైర్యసాహసాలందిస్తుంటే నేను జీవితంలో ఏమైనా సాధించగలను. నేనూ బతుకుతాను. జీవితంలో ఒకదారి మూసుకుపోతుంటే మరో దారి వెతుక్కుంటూ సాగిపోవాలి. జీవితం నిరంతర పోరాటం. నువ్వు నాతో వుంటావా?''

శ్యామల అంది ''ఉంటాను. నిన్ను విడిచి ఒక్క క్షణం వుండలేననిపిస్తూంది''

శంకర్ అన్నాడు ఆశగా ''మనిద్దరం పెళ్లిచేసుకుందాం. కలిసి పని చేద్దాం. కలిసి ఆలోచిద్దాం. నీకు ఇష్టమేనా?''

శ్యామల అంది. ''ఇష్టమే కాని పెళ్లివద్దు! స్నేహితులుగా కలిసి వుందాం. మన మధ్య అనురాగం స్థిరంగా వుండాలంటే దానికి పెళ్లి అనే ముద్ర

## దర్శక నాయుడు



సుప్రసిద్ధ చలనచిత్ర నిర్మాతగా, చలనచిత్ర పంపిణీదారుడిగా, ఎగ్జిబిటర్‌గా, స్టూడియో అధినేతగా ఇలా చలనచిత్ర రంగంలో పలు శాఖలలో విశేష అనుభవం వుండి, ఎందరినో నటీనటులుగా, దర్శకులుగా, సాంకేతిక నిపుణులుగా పరిశ్రమకు పరిచయం చేసిన డి.రామానాయుడు దర్శకుడు ఎప్పుడు అవుతాడా అని అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకులలో ఓ క్రేజీ వుంది. తన చిత్రాలలోనే సుమా! ఒకటి రెండు షాట్స్‌లలో నటుడిగా కనిపిస్తారు. కథా చర్చల దగ్గరనుండి సినిమా పూర్తయ్యేవరకు అడుగడుగునా దగ్గరుండి పర్యవేక్షించే నిర్మాత డి.రామానాయుడు దర్శకత్వం చేపట్టడం ఓ పెద్ద సమస్య ఏం కాదు. కానీ కాలం కలిసి రావాలి. అది ఎప్పుడొస్తుందో?

- సుబ్బారావు

వేయాలి అంటే మన ప్రేమకి స్వతః తగినంత బలం లేనట్టే.

శంకర్ అన్నాడు ''అంతవరకు నేను నీతో ఏకీభవిస్తాను. కాని మనం అడుగుపెట్టేది ఆ సమాజంలోకే. అక్కడ స్త్రీ, పురుషులు ఒకే ఇంట్లో వుంటూ మేం భార్యాభర్తలంకాము అంటే ఒక్కరోజూకూడా బతకలేం. మానవ సంబంధాలలో కొన్ని నియమ నిబంధనలూ అవసరం. మనకు పుట్టే పిల్లల భవిష్యత్తుకూడా ఆలోచించాలి. కనీసం మనం భార్యాభర్తలుగా నటించుతూనైనా వుండాలి''

శ్యామల కొద్దిసేపు ఆలోచించింది. ''అదీ నిజమే. మనిద్దరం భార్యాభర్తలంగానే వుందాం. కాని మన ఆంతర్యంలో మనం స్నేహితులం. జ్ఞాపకం వుంచుకో. భర్త అనగానే నామీద ఏవో కొన్ని అధికారాలు చలాయించాలని నువ్వు అనుకోకు. కట్నం లేకుండా, చెడిపోయిన ఆడదాన్ని పెళ్లిచేసుకుని ఇంత త్యాగం చేశాననే భావన రానీయకు. అలాగే నేనూ భార్యగా నిన్ను సాధించను. నువ్వు కష్టపడి సంపాదించి నాక్కావాల్సినవన్నీ సమకూర్చాలనీ, నన్ను అహర్నిశం ప్రేమిస్తూ, పొగుడుతూ వుండాలని, నాకు రక్షణ కల్పించాలనీ నేను కోరను. ఈ అవగాహనతో ఇద్దరం ఇక్కడే ఇప్పుడే భార్యాభర్తలం అయిపోదాం. ఏమంటావ్?''

శంకర్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి అన్నాడు ''ఈ క్షణంనుంచి మనం భార్యాభర్తలం. మంగళకరుడూ, అభయంకరుడూ, ఈ ఆలయంలో శివుడి సాక్షిగా...''

శ్యామల అతన్ని మధ్యలో ఆపి అంది ''వద్దు. వద్దు. మన నిర్ణయాలకి మనమే సాక్షి. భగవంతుడు ఎవరికీ సాక్ష్యం పలకడు. ఏ కోర్టుకీ రాడు. ఎవరినీ రక్షించడు. శిక్షించడు. అంతా ప్రకృతి ప్రభావం. మనిషికృషి నిరంతర శ్రమ, ప్రయత్నం! రా వెళదాం. మన కాళ్లమీద మనం నిలబడదాం. మనకి సమాజం లేదు. దాని కుటిల విలువలు, కట్టుబాట్లు లేవు. మనకు దేవుడూ లేడు, దెయ్యం లేదు. మనం నిజమైన స్వచ్ఛమైన మనుష్యులం. ఆలంబనలూ, ఆత్మవంచనలు వద్దు. రా వెళదాం!''

ఆమె మౌనంగా అడుగులువేస్తూ ముందుకు నడిచింది. శంకర్ భయంగా తడబడుతూ ఆమెవెంట నడిచాడు. ఆమె ఒక జ్యోతిలా ముందుకు సాగిపోతోంది. ఆమెలో ప్రాణశక్తి ఎర్రగా మండుతోంది. ఆమె పాదాలకింద ఈ సమాజపు కళేబరం అవశేషాలు నలిగి మండి మసైపోతున్నట్టుంది. వెనకనే వస్తున్న శంకర్ ఆమెకు చేతులెత్తి నమస్కరించాడు.

సమాజం మనిషిని కరుస్తుంది. ముక్కలుగా చీల్చి కొరుక్కు తింటుంది. తన కోరలు చాచి భయపెడుతుంది. తరిమి తరిమి కొడుతుంది. కాని అది వట్టి గాలి బుడగ. ఒక్క పోటు పొడిస్తే పీలికలా నేలకూలుతుంది. కాని ఆ ఒక్క పోటు పొడిచే ధైర్యం, కోటిమందిలో ఒకరికి. ఆ ఒక్కరిలో శ్యామల ఒకతె!

ఇద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని, అరణ్యం దాటి ఊరు ప్రవేశించారు. ఊరు, ఊళ్లో మనుష్యులు అలాగే వున్నారు. కాని ఈ ఇద్దరికీ సమాజం లేదు!